సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 8 । మే । 2023



**కొనసాగుతున్న సమ్మె**
డిమాండ్ల సాధన కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. - 9లో



**యాప్‌ను వినియోగించుకోవాలి**
నిరుద్యోగులు 'నల్లగొండ యువతరం' యాప్‌ను వినియోగించుకోవాలని ఎంజీయూ వీసీ సూచించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
36° / 26°

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### విద్యార్థులకు చిత్రలేఖన శిబిరం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి : సాక్షి మీడియా గ్రూప్, రోటరీక్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ సంయుక్తంగా భువనగిరిలోని విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన వేసవి చిత్రలేఖన శిబిరానికి స్పందన లభిస్తోంది. మూడో రోజు ఆదివారం విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఆవుల వినోద్‌కుమార్ చిత్ర లేఖనంపై శిక్షణ ఇచ్చారు. చిత్రాలు ఏ విధంగా గీయాలి, వేయవల్సిన రంగులపై అవగాహన కల్పించారు. సోమవారం శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

### కూరెళ్ల విఠలాచార్యకు నేడు గురు సత్కారం



కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట : మధుర కవి, దాశరథి పురస్కారగ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు సోమవారం హైదరాబాద్‌లోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో గురు సత్కారం జరగనుంది. మారుమూల గ్రామంలో మహా గ్రంథాలయం ఏర్పాటు చేసి ఊరూరా గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి స్ఫూర్తిగా నిలిచినందుకు గాను విఠలాచార్యను పంచార్షేయ వైదిక పరిషత్తు ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. పల్లకిసేవ, పుష్పాభిషేకం, విశ్వాక్షరబ్రహ్మ బిరుదు ప్రదానం, పాదపూజ, జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఏలూరి శివారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీశంకర్ హాజరుకానున్నారు.

### 'ఉపాధిహామీ'చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర



జెండావిష్కరణలో సీపీఎం నాయకులు

భువనగిరి : పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని మోదీ సర్కార్ నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. ఆదివారం భువనగిరి మండలంలోని బస్వాపూరంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ పోతేనే కార్మిక, ప్రజల హక్కులను రక్షణ ఉంటుందన్నారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణ, చంద్రయ్య, విష్ణు, బాలనరసింహ, భాస్కర్, సత్యనారాయణ, వెంకటేష్, చంద్రమౌళి, మధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లు వచ్చేశాయ్



న్యూట్రిషన్ కిట్‌లో వస్తువులు

భువనగిరి : గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు ప్రభుత్వం ఇటీవల కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను పంపిణీ చేస్తోంది. జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఇటీవల 735 కిట్‌లు వచ్చాయి. ఈ కిట్‌లో మదర్స్ హార్లిక్స్ 500 గ్రాములు, ఐరన్ సిరప్ 200 మి.లీ, లయన్ డేట్స్ (కర్జూర) 500 గ్రా, ప్లాస్టిక్ బాస్కెట్, ప్లాస్టిక్ కప్, విజయ నెయ్యి 450 మి.లీ, అల్బెండజోల్ టాబ్లెట్‌లు మొత్తం ఏడు రకాల వస్తులు ఉంటాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడు నెలల పాటు వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు వీటిని పంపిణీ చేయనున్నారు. ఇదుకోసం వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,467 మంది గర్భిణులు ఉన్నారు.



యాదాద్రి ఆలయ తిరు వీధుల్లో కిక్కిరిసిన భక్తులు

### నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఇక ఆలయ ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

### బోనమెత్తిన ఆత్మకూర్



ఆత్మకూర్(ఎం)లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా బోనాలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

# బస్సులు రావు.. బాధలు తీరవు!

**రోడ్డు నిర్మాణం పేరుతో సర్వీసులు రద్దు**
- పూర్తయినా పునరుద్ధరించని అధికారులు
- ఐదు మండలాల ప్రజలకు రవాణా తిప్పలు
- ప్రైవేట్ వాహనాలే ఆధారం



వావిళ్లపల్లి శివారులో పూర్తయిన రోడ్డు

సంస్థాన్ నారాయణపురం : నల్లగొండ డిపో బస్సులు రద్దు చేశారు.. హైదరాబాద్ మెట్రో బస్సులు ముచ్చటగా ఆరు నెలలే నడిపారు.. మునుగోడు ఉప ఎన్నిక ముందు భువనగిరితో పాటు యాద్రాది దేవస్థానం వరకు బస్సులు నడిపిన అధికారులు.. ఎన్నిక ముగియగానే నిలిపివేశారు!. రోడ్డు నిర్మాణం పేరుతో రద్దు చేసిన అధికారులు.. పనులు పూర్తయినా పునరుద్ధరించడం లేదు. వెరసి ఐదు మండలాల ప్రజలకు రవాణా భారంగా మారింది.

**ఈ మార్గంలో రద్దు**
చండూరు, గట్టుప్పల్, జనగాం, సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్ వరకు నల్లగొండ డిపో బస్సులు నడిపేవారు. ఐదు నెలల క్రితం లచ్చమ్మగూడెం, చిల్లాపురం, వావిళ్లపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో నెల రోజుల పాటు సర్వీసులు రద్దు చేశారు. తర్వాత వావిళ్లపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో మరో రెండు నెలలు ఆపేశారు. సీసీ రోడ్డు పూర్తయ్యింది. కానీ, బస్సులు నడపడం లేదు. దీంతో ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణం చేస్తున్నారు. సాయంత్రం తర్వాత ఆటోలు బంద్ కావటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, చౌటుప్పల్‌లో పరిశ్రమలు, దుకాణాల్లో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జనగాం, ఆరెగూడెం, వావిళ్లపల్లి, చిల్లాపురం, గిరిజన తండాలకు చెందిన ప్రజలు సంస్థాన్ నారాయణపురం, దేవిరెడ్డిబంగ్లా స్టేజీల వరకు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలపై, ప్రైవేట్ వాహనాల్లో, కొంత మంది నడుచుకుంటూ వస్తున్నారు.

**మెట్రో బస్సులు రద్దు**
ఈ ప్రాంత ప్రజలు వివిధ పనుల కోసం నిత్యం హైదరాబాద్‌కు వెళ్లొస్తుంటారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌లోని హయత్‌నగర్ డిపోకు చెందిన బస్సులను ఆరు నెలల క్రితం సంస్థాన్ నారాయణపురం నుంచి చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కు నాలుగు బస్సులను 8 ట్రిప్పులు నడిపించేవారు. వాటిని రెండు నెలల క్రితం వావిళ్లపల్లి, మునుగోడు మండలం చీకటిమామిడి, గట్టుప్పల్ మండల కేంద్రం వరకు పొడిగించారు. కానీ, పది రోజుల నుంచి బస్సులను ఆకస్మికంగా రద్దు చేసినారు. వాటిని చౌటుప్పల్ వరకే పరిమితం చేశారు. దీంతో ప్రయాణికులుకు మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. నల్లగొండ ఆర్టీసీ డిపోకు చెందిన అధికారులు హద్దుల పేరుతో హయత్‌నగర్ డిపోకు అధికారులను ప్రశ్నించడంతోనే బస్సులను రద్దు చేశారని ఆరోపణలున్నాయి. హద్దులతో సంబంధం లేకుండా అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపాలని ప్రజలు కొరుతున్నారు.

**బైక్‌లపై, ఆటోల్లో వెళ్తున్నాం**



రోడ్డు పని చేస్తున్నారని బస్సులు బంద్ చేశారు. పూర్తయినా నడిపిస్తలేరు. చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, గట్టుప్పల్ వెళ్లాలంటే బస్సులు లేక ఇబ్బందులు అవుతున్నాయి. బైక్‌లపై, ఆటోల్లో వెళ్లవల్సివస్తుంది. వెంటనే బస్సులు పునరుద్ధరించాలి.
– స్వామి, వావిళ్లపల్లి

**జిల్లా కేంద్రానికి బస్సు వేయాలి**



భువనగిరికి, యాదగిరిగుట్ట దేవాలయానికి వెళ్లడానికి బస్సు లేదు. గతంలో బస్సు నడిపించి మళ్లీ రద్దు చేశారు. రోడ్డు పనులు పూర్తయినందున బస్సులు పునరుద్ధరించాలి. ప్రయాణికుల ఇబ్బందులను అర్థం చేసుకోవాలి.
–నీలా లవకుమారు, సంస్థాన్‌నారాయణపురం

**హయత్‌నగర్ నుంచి నడపాలి**



హయత్‌నగర్ డిపో నుంచి నారాయణపురం మండలం వరకు రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలి. ఎమ్మెల్యే, అధికారులు జోక్యం చేసుకొని బస్సులు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి.
– కల్లెట్ల అరుణ్‌సాగర్, సహస్ర వేదిక్ సేవా సమితి వ్యవస్థాపకుడు, సంస్థాన్ నారాయణపురం

**ప్రైవేట్ వాహనాలే దిక్కు**



జనగాం మీదుగా ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

సంస్థాన్ నారాయణపురం మండలం నుంచి జిల్లా కేంద్రం భువనగిరికి బస్సు సౌకర్యం లేదు. గతంలో సంస్థాన్‌నారాయణపురం నుంచి భువనగిరి వరకు ఉన్న బస్సును రద్దు చేశారు. మునుగోడు ఉప ఎన్నిక ముందు నాంపల్లి మండల కేంద్రం నుంచి జనగాం, సంస్థాన్‌నారాయణపురం మీదుగా భువనగిరి, యాదగిరిగుట్ట (యాద్రాది దేవాలయం) వరకు రెండు బస్సులు ఏర్పాటు చేశారు. ఎన్నిక అనంతరం వాటిని రద్దు చేశారు. బస్సులును రద్దు చేయడంతో భువనగిరి, యాదగిరిగుట్టకు బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడికి వెళ్లాలంటే ద్విచక్ర, అద్దె వాహనాలపై పోతున్నారు. బస్సులో వెళ్లాలంటే చౌటుప్పల్‌కు వెళ్లి, అక్కడ నుంచి చిట్యాల, చిట్యాల నుంచి భువనగిరికి వెళ్తున్నారు. రద్దు చేసిన బస్సులును పునరుద్ధరించాలని ప్రయాణికులు కొరుతున్నారు.

## యువ సంఘర్షణ సభకు తరలిరావాలి

- డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 8వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యార్థి, నిరుద్యోగ, యువ సంఘర్షణ సభకు పార్టీ, అనుబంధ సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ ఆలిండియా ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల కల్పన, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతిపై సభలో భరోసా ఇవ్వనున్నట్ల వివరించారు. కేంద్రంలో, రాష్ట్రంలో నిరుద్యోగుల కు ఉద్యోగాల కల్పనకు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అన్ని గ్రామాలు, మండల కేంద్రాల నుంచి నిరుద్యోగులు, యువత, పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య




మాట్లాడుతున్న వీరయ్య

భువనగిరిటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య ఆరోపించారు. భువనగిరిలో ఆదివారం నిర్వహించిన మేడే వారోత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక హక్కుల సాధన కోసం జరిగిన పోరాటం ఎంతోమంది ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. అమరవీరుల స్ఫూర్తితో హక్కుల పరిరక్షణకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కులం, మతం పేరుతో కార్మికుల మధ్యన విద్వేషాలను రెచ్చగొడుతూ ఐక్యతను దెబ్బతీస్తూ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు పొందుతుందని ఆరోపించారు. బీజేపీ హిందువుల పార్టీ అని చెప్పుకుంటుందని, పెంచుతున్న ధరలు హిందువులపై ప్రభావం చూపవా అని ప్రశ్నించారు. అధికారం కోసం మతాన్ని వాడుకుంటున్నారే తప్ప.. హిందువుల కోసం కాదన్నారు. బీజేపీ సర్కార్ కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసమే పని చేస్తుందని విమర్శించారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాషా, సోములు, భాగ్య, కృష్ణ, సత్యనారాయణ, యాదమ్మ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.



### వాటర్‌ఫాల్స్ ట్రయల్ రన్



యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచేందుకు మొదటి ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన వాటర్‌ఫాల్స్‌ను అధికారులు ఆదివారం ట్రయల్‌రన్ నిర్వహించారు. ఘాట్ రోడ్డు వెడల్పు చేస్తున్న నేపథ్యంలో వాటర్‌ఫాల్స్‌ను ప్రారంభించలేదు. త్వరలో ఘాట్‌రోడ్డు నుంచి వాహనాలను అనుమతించనున్న నేపథ్యంలో జలపాతాన్ని అధికారులు ట్రయల్ రన్ చేసి పరిశీలించారు.

## బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట : తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదని, కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్టలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులు ఉద్యోగ భరోసా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకే వస్తే నిరుద్యోగులు, ప్రజల బతుకులు మారుతాయన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ప్రియాంకగాంధీ ఆధ్వర్యంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు యువత, నిరుద్యోగులు పెద్దసంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో ఎంపీపీలు చీర శ్రీశైలం గంధమల్ల అశోక్, కౌన్సి లర్ ముక్కెర్ల మల్లేష్ యాదవ్, యాదగిరిగుట్ట, గుండాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, ఈరసరపు యాదగిరిగౌడ్, మండలాల అధ్యక్షులు నమిలే మహేందర్, అధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి గౌడ్, గుండు నర్సింహ, బూడిద భాస్కర్, గుండ్లపల్లి ముత్యాలు, బొజ్జ సాంబేష్, బిట్టు హరీష్, బూడిద మధు పాల్గొన్నారు.

# భయంభయంగా విధులు!

**శిథిలావస్థలో యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయం**
- ఊడి పడుతున్న పైకప్పు పెచ్చులు
- ఇటీవల ఓ ఉద్యోగికి తప్పిన ముప్పు
- నూతన భవనానికి రూ.3.20 కోట్లు మంజూరు
- టెండర్ల నిర్వహణలో జాప్యం



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన మున్సిపల్ మేనేజర్ చాంబర్ పైకప్పు



కౌన్సిల్ సమావేశం హాల్ గోడలు ఇలా..



పర్రెలు పట్టిన కంప్యూటర్ గది పైకప్పు

యాదగిరిగుట్ట : బీటలు వారిన గోడలు.. పెచ్చులూడుతున్న పైకప్పు.. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని స్థితి.. అందులోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు ఉద్యోగులు..! ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువైన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం ఎక్కడికక్కడ పర్రెలు పట్టింది. ప్రమాదకరంగా మారిన ఈ భవనం నుంచి పాలన సాగించాలంటే అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు ఆందోళన చెందుతున్నారు. నూతన భవనం కోసం నిధులు మంజూరైనా ఇంకా టెండర్లు పిలువలేదు.

**కార్యాలయం మార్చాలని వినతి**
ప్రధానంగా కమిషనర్, చైర్‌పర్సన్ చాంబర్, కౌన్సిల్ హాల్, కార్యాలయ సిబ్బంది పని చేసే హాల్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భయంతో విధులు నిర్వహించాల్సి వస్తుందని, శిథిల భవనాన్ని ఖాళీ చేసి మరోచోటకు మార్చాలని అధికారులు, పలువురు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్‌కు ఇటీవల విన్నవించారు. పక్కనే మున్సిపాల్టీకి చెందిన ఫంక్షన్ హాల్ మరియు లాడ్జి, డార్మింటరీ హాల్‌లోకి మార్చాలని కోరారు.

**1962లో నిర్మాణం**
యాదగిరిగుట్ట గ్రామ పంచాయతీగా ఏర్పాటైన సమయంలో అప్పటి సర్పంచ్ వేముల లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో 1962లో భవనాన్ని నిర్మించారు. 2018 ఆగస్టులో యాదగిరిగుట్ట గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా ఏర్పడింది. అప్పటికే భవనం పర్రెలు రావడం, చిన్నచిన్న పెచ్చులు ఊడి పడిన సంఘటనలు చోసుకున్నాయి. దీంతో అధికారులు పెచ్చులు ఊసిన ప్రాంతాల్లో సిమెంట్‌తో మరమ్మతులు చేశారు. కానీ, భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షాలకు మరింత ప్రమాదకరంగా తయారైంది.

**సిద్ధంగా నిధులు**
శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరిగుట్ట పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సంకల్పించారు. చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయాన్ని సైత అధునాతన, ఆధ్యాత్మిక హంగులతో నిర్మించాలని భావించారు. యాదాద్రి దేవస్థానం రూపం వచ్చేలా కార్యాలయం నిర్మాణం జరగాలని ఆదేశించారు. ఇందుకోసం మార్చి 23న రూ.3.20కోట్లు మంజూరు చేశారు. కానీ, ఇప్పటి వరకు టెండర్ ప్రక్రియ చేయ లేదు. యాదాద్రి ఆలయ రూపం వచ్చేలా ప్లానింగ్ రూపొందించాల్సి ఉండడంతో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**నాకు ముప్పు తప్పింది**



మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. నాలుగు రోజుల క్రితం నేను విధులు నిర్వహిస్తున్న గది పైకప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. శబ్దానికి పక్కకు వచ్చాను. అప్రమత్తంగా లేకుంటే నామీదే పడేవి. భవనంలో విధులు నిర్వహించాలంటే నాతో పాటు సిబ్బంది భయపడుతున్నారు. కార్యాలయాన్ని మరో చోటకు మార్చాలని చైర్‌పర్సన్ కోరాం.
– నరేష్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయ మేనేజర్

**అధికారుల దృష్టికి తీసుకెళ్లాం**



మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మాణం చేసి 60 సంవత్సరాలకు పైగా అవుతుంది. పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నూతన భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో రూ.3.20 కోట్లు మంజూరు చేసింది. త్వరితగతిన పనులు చేపట్టాలని, యాదాద్రి దేవస్థానం రూపంలో నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. త్వరలోనే టెండర్లు పిలుస్తాం. అప్పటి వరకు మరోక భవనంలోకి కార్యాలయాన్ని మారుస్తాం.
– ఎరుకల సుధ, మున్సిపల్ చైర్‌పర్సన్

## క్లుప్తంగా

### భూతవైద్యుడిపై కేసు


ఎస్‌ఓటీ పోలీసులు కేసు నమోదు చేసిన అనిల్

మోటకొండూర్ : భూత వైద్యం పేరుతో ప్రజలను మోసగిస్తున్న వ్యక్తిపై మోటకొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన సుధగాని అనిల్ భూతవైద్యం పేరులో ప్రజల వద్ద డబ్బులు దండుకుంటున్నాడని ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు వైద్యం కావాలని ఆదివారం వెళ్లి అనిల్ వద్ద ఉన్న డబ్బులు, సెల్‌ఫోన్‌లు, తాయత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో మహిళకు తీవ్ర గాయాలు

- కోతులను వెళ్లగొట్టే క్రమంలో ప్రమాదం

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుజిలాల్ రమణ సాయంత్రం ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈ సమయంలో కోతులు ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించాయి. వాటిని వెళ్లగొట్టేందుకు ఇంటిపైకి వెళ్లింది. అక్కడ ఉన్న స్టీల్ పైపుతో కోతులను వెళ్లగొడుతోంది. ఇదే సమయంలో స్టీల్ పైపు ఇంటి పక్కనే ఉన్న 11 కేవీ వైర్లకు తగలడంతో రమణ విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. విద్యుత్‌లైన్ ట్రిప్ కావడంతో సరఫరా నిలిచిపోయింది. ప్రమాదాన్ని గమనించిన సమీప వ్యక్తులు వెంటనే ఆమెను తొలుత నకిరేకల్ అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రమణ ఆరోగ్యం కొంత నిలకడగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### కూల్‌డ్రింక్ షాపులో చోరీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని బైపాస్ రోడ్డులో గల కూల్‌డ్రింక్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజు మాదిరిగా షాప్ బంద్ చేసి వెళ్లిపోయిన తర్వాత దుకాణం వెనుక ఉన్న చిన్నడోర్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. కూల్‌డ్రింక్ బాటిల్స్, సిగరెట్ ప్యాకెట్స్, కౌంటర్లో ఉన్న నగదు అపహరించారు. సుమారు రూ.5 వేల వరకు ఉండవచ్చని బాధితుడు పేర్కొన్నాడు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఒక సెల్‌ఫోన్ దొరికినట్లు తెలిసింది.

### విజయవంతం చేయాలి

కట్టంగూర్ : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ నకిరేకల్ నియోజకవర్గ పరిశీలకుడు మర్రి నిరంజన్‌రెడ్డి కోరారు. బహిరంగ సభ ప్రచార పోస్టర్‌ను టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్‌తో కలిసి కట్టంగూర్‌లో ఆదివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ళ వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మసాగర్, కౌన్సిలర్ గాజుల సుకన్య, జిల్లా కార్యదర్శి మాద లింగస్వామి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చెరుకు యాదగిరి, రెడ్డిపల్లి వీరస్వామి, ఎరుకల లక్ష్మీనారాయణ, గోపి పాల్గొన్నారు.

# ఘనంగా చక్రతీర్థం, వసంతసేవ

- మట్టపల్లిలో కొనసాగుతున్న ఉత్సవాలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం బ్రహ్మశ్రీ బొర్రా వాసుదేవాచార్యులు పర్యవేక్షణలో శ్రీస్వామివారికి శాస్త్రోక్తంగా వసంతసేవ, చక్రతీర్థము, హోమపూర్ణాహుతి గావించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, ద్రవిడప్రబంధసేవాకాలం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి దోపోత్సవం(తిరుమంగయాళ్వారాదుల చరిత్ర పఠనం) ధ్వజావరోహణము, మౌనబలి, చేపట్టారు. కాగా స్వామిఅమ్మవార్లను అశ్వవాహనంపై శ్రీజయమన్నార్ అలంకారంలో ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజైన సోమవారం శ్రీరంగనాయకస్వామి అలంకారంలో శృంగారడోలోత్సవం(పవళింపుసేవ), భక్తి సంగీతవిభావరి, ఆశీర్వచనము, తీర్థప్రసాదాల వినియోగం ఉంటాయని అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ తెలిపారు. వేడుకల్లో పాలకమండలి సభ్యులు, వెంకటనారాయణ, రామయ్య, కామేశ్వరమ్మ, ఫణికుమార్, అర్చకులు రామాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, హరికిరణాచార్యులు, వంశీక్రిష్ణమాచార్యులు, బజ్జూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


మట్టపల్లిలో వసంతసేవ నిర్వహిస్తున్న అర్చకులు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

# చెన్నై టు కశ్మీర్‌కు సైకిల్ యాత్ర..

- తమిళనాడుకు చెందిన యువకుడి సాహసం
- పర్యావరణ పరిక్షణపై అవగాహన కల్పించేందుకేనని వెల్లడి

మాడుగులపల్లి: చెన్నై టు కశ్మీర్ దాదాపు 3000 కిలోమీటర్లు. బస్సు, రైల్లో వెళ్లాలంటే రోజుల తరబడి సమయం పడుతుంది. అలాంటిది ఒంటరిగా ఓ యువకుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. యువతకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నాడు. అతడే తమిళనాడు రాష్ట్రానికి చెందిన బిషాల్. మే 1న యాత్ర ప్రారంభించి వారంరోజుల్లో మాడుగులపల్లి వరకు చేరుకున్నాడు. వివరాలు అతడి మాటల్లోనే.. నా పేరు బిషాల్. ఇంటర్ వరకు చదివా. పేదరికం వల్ల చదువు మధ్యలో వదిలేశా. మాకు కోయంపేట్ నగరంలో చిన్న టీ కొట్టు ఉండడంతో నాన్నకు పనిలో సాయం చేసేవాడిని. చిన్ననాటి నుంచి ప్రకృతి, పర్యావరణ అంశాలంటే ఆసక్తి. ఆధునిక ప్రపంచంలో యువతకు వీటిపై స్పృహ కరువైంది. అందుకే అవగాహన పెంచేందుకు తల్లిదండ్రులను ఒప్పించి సైకిల్ యాత్ర చేపట్టా. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజూ 12 గంటలు సైకిల్ తొక్కుతూ 100 నుంచి 120 కిలోమీటర్లు ప్రయాణిస్తా. గతంలో ఆర్మీ ఎంపికలో పాల్గొని ఛాతీ సరిపోక త్రుటిలో అవకాశాన్ని కోల్పోయా. రోజుకూ 100 కిలోమీటర్లు ప్రయాణించినా అలసట అనిపించదు. రాత్రి రహదారుల వెంట పెట్రోల్ బంకులు, బస్టాండుల్లో పడుకుంటా. పెద్ద మొత్తంలో డబ్బు లేకున్నా ఉన్న కొద్దిపాటితో సద్దుకుంటున్న. తెలంగాణలోకి ప్రవేశించాక చాలా మంది సాయం అందించారు. ఇక్కడి మనుషులకు సాయం చేసే గుణం ఉంది. మరో 25 రోజుల్లో కశ్మీర్ చేరుకొని అక్కడ సరిహద్దు ప్రదేశాలను కూడా వీక్షించాలన్నది నా కోరిక' అంటూ తన యాత్ర విశేషాలను వెల్లడించాడు.


సైకిల్ యాత్ర చేస్తున్న బిషాల్

# బూత్ స్థాయిలో పార్టీని పటిష్ట పర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

నల్లగొండ టూటౌన్ : బూత్ స్థాయిలో బీజేపీని ప్రతిష్ట పరిచి పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ అన్నారు. ఆదివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ప్రబాస్ యోజన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బీజేపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్లలో ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను గడపగడపకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్, సినీనటి కవిత, నూకల నరసింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పాలకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

హుజూర్‌నగర్: క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచంద్ర గౌడ్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు దేవరం రవీందర్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఎస్ఎస్‌పీ క్యాంప్‌లో నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిబిరాన్ని ఆదివారం వారు సందర్శించి మాట్లాడారు. క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో కబడ్డీ అభివృద్ధికి అనేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత ఆయా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ శిక్షకులు సునీల్ కుమార్, పీఈటీలు రవి, మైసయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రగౌడ్ తదితరులు

## రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని వంగపల్లి గ్రామ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం జమ్మాపురం గ్రామానికి చెందిన చిన్నబత్తిని రాజేష్ (31) ఆలేరులోని తమ బంధువుల ఇంటికి శనివారం వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి పదకొండు గంటల సమయంలో తిరిగి జమ్మాపురం గ్రామానికి, తన నానమ్మ దుస్తైనమ్మతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి పరిధిలోనికి రాగానే వెనకనుంచి కారు ఢీ కొట్టింది. దీంతో రాజేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దుస్తైనమ్మకు, స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, పాప ఉన్నారు. మృతుడి తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలియజేశారు.

# ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భానుపురి : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఐదు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం మధ్యాహ్నం చక్రస్నానం, రాత్రి శ్రీ పుష్పయాగంతో ముగిసాయని ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం యాగశాలలో ద్వార తోరణ, ధ్వజ కుంభ ఆరాధనలు పూర్తి చేసి మూల మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. తదనంతరం వసంతోత్సవం చేపట్టి ఆలయంలోని ఈశాన్య భాగంలో ఉన్న కోనేరులో చక్రస్నానం నిర్వహించారు. రాత్రి జరిగిన శ్రీపుష్పయాగంలో ప్రత్యేకంగా తెప్పించిన 12 రకాల పూలతో మండలం రచించి శ్రీపుష్పయాగం చేశారు. వేంకటేశ్వర స్వామి వారికి పుష్పాభిషేకం చేశారు. 12 రకాల ప్రసాదాలు నివేదన చేసి భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్యులు హరిచరణ్ ఆచార్యులు, భరత్ కుమార్ ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, సంకర్షణ ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, కృష్ణయ్య, రవీందర్, మాధవరావు, మంజుల, జ్ఞాన కుమారి, మాధవి, లక్ష్మి వెంకటేశ్వరరావు, శ్రీశైలం, రజిత, ఆండాళ్ గోష్టి భక్త బృందం, వికాస తరంగిణి భక్త బృందం పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

నార్కట్‌పల్లి : వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అమ్మనబోలు గ్రామంలో ఆదివారం రైతులు రాస్తారోకో చేశారు. అమ్మనబోలు గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రెండు వేల బస్తాలు నింపారని, లారీలు రాకపోవడంతో రాత్రి కురిసిన అకాల వర్షానికి బస్తాలన్నీ తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం వచ్చినప్పటికీ పది రోజుల నుంచి లారీలు రాకపోవడం, కాంటాలు పెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంటాలు వేసిన ధాన్యాన్ని సైతం తీసుకుపోవడం లేదని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అధికారులతో మాట్లాడి నచ్చజెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, బద్దం రాంరెడ్డి, ఉప సర్పంచ్ జాన్‌రెడ్డి, కావటి పరశురాములు, ఎల్లేష్ పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న రైతులు

# 'మునుగోడు'లో శరవేగంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ : ఉప ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారంగా మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల పనులు జరగవని, అవి శిలాఫలాకాలకే పరిమితం అవుతాయని మాట్లాడిన వ్యక్తుల కళ్లు అభివృద్ధిని చూసి మూతలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల్లో ఓడిన వ్యక్తి పదవిలో ఉన్నప్పుడు చేసిందేమీలేదని విమర్శించారు. ఇప్పుడు తాము అభివృద్ధి చేసి చూపుతుంటే మాత్రం సొల్లు మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో పనులు ప్రారంభించినవి, జీవో విడుదలైన నిధులు 288కోట్లుకాగా, మరో 226 కోట్ల నిధులకు సంబంధించి జీఓ విడుదల కావాల్సి ఉందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా మంత్రి కేటీఆర్ ప్రకటించిన దత్తత హామీ మేరకు అన్ని రకాల సమస్యలకు పరిష్కారం జరుగుతుందన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఇచ్చిన 50కోట్ల హామీలో రూ.25కోట్లు విడుదల చేస్తూ ఈ నెల 5న ప్రభుత్వం జీఓ ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్, సింగిల్‌విండో చైర్మన్‌లు వెన్‌రెడ్డి రాజు, చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ఎండీ.బాబాషరీఫ్, నాయకులు గుండెబోయిన వెంకటేష్, కానుగు బాలరాజు, తొర్పునూరి మల్లేష్‌గౌడ్, తాడూరు పరమేష్, తొర్పునూరి నర్సింహ్మ, శవగోని వెంకటేశ్, కాకి సుందర్, రామచంద్రం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలి

రామగిరి(నల్లగొండ): నియోజకవర్గంలో అర్హులైన 1500 మందికి దళితబంధు అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిప్పర్తి మండలంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో ఆదివారం జరిగిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళిత పేదలకు పీఓటీ భూములు పట్టాలు చేయాలన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్లలో దళితులపై దాడులు అధికమయ్యాయని పోలీసులు అరికట్టాలన్నారు. కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పర్శరాములు, జిట్టా నగేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దైద శ్రీను, బొట్టు శివకుమార్, పెరిక విజయకుమార్, కోడిరెక్క మల్లన్న, రవీందర్, దంతాల నాగార్జున, మల్లయ్య, పాపరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

## నేడు నల్లగొండలో గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమం ఈ సోమవారం నిర్వహించడం లేదని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించిందని, అందువల్ల 8వ తేదీన నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డేను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

## వర్షం.. తడిసిన ధాన్యం


పెద్దవూరలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు




పెద్దవూరలో ధాన్యం చుట్టూ నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు


పెద్దవూరలో ధాన్యం చుట్టూ చేరిన వర్షం నీరు



# భూసార నమూనాలు సేకరించే సమయమిదే..

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు

పాడి పంట

నడిగూడెం : ప్రస్తుతం రబీ సీజన్ కూడా పూర్తయింది. వరి, ఇతర క్షేత్ర పంటలు కూడా ఏమీ లేవు. ఈ సమయంలోనే మట్టి నమూనాలు తీసి, వాటిని పరీక్ష చేయించాలి. ఆ భూసార ఫలితాల ఆధారంగా ఎరువులను ఉపయోగించాలని సూచిస్తున్నారు.. నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు.

**భూసార పరీక్ష అంటే....**

పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి, దాని ద్వారా ఎంత మోతాదులో ఎరువులను వాడాలో తెలుసుకోవడమే ఈ భూసార పరీక్షకు అర్థం.

**మట్టి నమూనాలు తీసే సమయం**

- పంట కోత తర్వాత తీయవచ్చు.
- వేసవిలో పంటలు లేని సమయంలో తీయవచ్చు.

**మట్టి నమూనాలు తీయకూడని ప్రదేశాలు – సమయాలు**

- ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు నమూనా తీయరాదు.
- నీరు పెట్టిన తరువాత తీయరాదు.
- నీడపడే ప్రదేశాలు, నీటి ముంపు ప్రాంతాలు, పెంటకుప్పలు దగ్గర, గట్లు, చెట్లు, రోడ్ల దగ్గర తీయరాదు.


మట్టి నమూనాలు తీస్తున్న రైతులు

**మట్టి నమూనాలు తీయాల్సిన విస్తీర్ణం**

ఒక రకం పొలానికి ఒక నమూనా తీయాలి. పొలం మరీ పెద్దయితే ప్రతి ఐదు ఎకరాల్లో నమూనా తీయాలి. నేల నిర్మాణం, రంగు, మురుగు, పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, గుణాలు, పంటలసరళి, మొదలగు విషయాల్లో ఏవేని, తేడా కన్పిస్తే అన్ని నమూనాలు ఆ పొలం నుంచి తీయాల్సి ఉంటుంది.

**నమూనాలు సేకరించాల్సిన లోతు**

- పైరు పంటలకు 6 అంగుళాలు
- పండ్ల తోటల్లో 5నుంచి 6అడుగుల వరకు. ప్రతి అడుగుకు ఒక నమూనా
- చౌడు, ఆమ్ల నేలలకు–అడుగు లోతులో ప్రతి 6అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

**నమూనాలు ఎలా సేకరించాలి**

- నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొదలగు వాటిని తీసి వేయాలి.
- గడ్డపారను, పారను గానీ నమూనాను తీయడానికి ఉపయోగించాలి.
- గొయ్యి అంచుల నుంచి పారతో, తాపీతో గానీ మట్టిని సేకరించాలి.
- పొలంలో 8నుంచి 10 స్థలాల నుంచి ఈ పద్ధతిలో మట్టిని సేకరించాలి.
- సేకరించిన మట్టినంతటిని కలిపి నేలపై పరచి దానిని నాలుగు భాగాలు చేయాలి. మూలలకు ఎదురెదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని పారవేయాలి. ఈ విధంగా 500 గ్రాముల నమూనాలను సేకరించాలి.
- ఈ అరకేజీ మట్టిని గుడ్డ సంచిలో, పాలిథిన్ సంచిలో గానీ వేసి, రైతు పేరు, చిరునామా, సర్వే నంబరు, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటలు, గత 3 సంవత్సరాలుగా వాడుతున్న ఎరువులు, రాబోవు సీజన్‌లో వేయాల్సిన పంటలు, సేకరించిన తేదీ మొదలగు వివరాలను జతచేయాలి. సమాచార పత్రంతో కూడిన మట్టి నమూనాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు లేదా భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.

**భూసార పరీక్షల వల్ల ఉపయోగాలు**

- పొలంలో పోషకాల స్థాయి తెలుస్తుంది.
- ఆ పొలంలో ఏయే పంటలు పండించవచ్చో తెలుస్తుంది.
- ఎరువులు ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేలల సమస్యలు తెలుస్తాయి. దాని ప్రకారం ఎరువులను ఉపయోగించవచ్చు.
- ఎరువుల అనవసరపు ఖర్చు తగ్గించవచ్చు. సరైన సమయంలో భూసార పరీక్షలు చేయిస్తే సేంద్రియ ఎరువులను కూడా ఉపయోగించి నాణ్యమైన పంటలను పండించవచ్చు.